
# గుప్తజ్ఞానం

## కె.వి.ఎస్.వర్మ




ఛార్మినార్ సిగరెట్ కాలుస్తూ, "తెలుగు సినిమా చూసి చాలా రోజులయింది" అన్నాడు కవికుమారుడు.

"ఈ మధ్యో సినిమా చూశాను. మందు డైలాగులు మళ్లీ మొదలయ్యాయి" అన్నాడు కథరాజు సిగరెట్ పొగ తనమీదకు రాకుండా చేయి పైకెత్తి అటూ ఇటూ ఊపుతూ.

"ఏంటా చిత్ర రాజము"

"ఆ పేర్లెక్కడ గుర్తుండి ఛస్తాయిలే, అన్నీ తమాషా పేర్లే కదా! హుషారు పాటలు, నిషా నృత్యాలూ"

"ఖుషీ ఖుషీగా నవ్వుతూ, చలాకి మాటలు రువ్వుతూ, హుషారుగా వుందాములే నిషా కనుల దాన" అంటూ కొటేషన్‌రావు అందుకున్నాడు.

ఆ పాట అయ్యేటప్పటికి ఓ కుర్రాడు జంతికల జంగిడీ పట్టుకుని వచ్చాడు.

మిత్రులంతా జంతికలు తినే భారీ కార్యక్రమంలో పడ్డారు. గోదావరి గలగలల శబ్దం జంతికల కరకరల శబ్దంలో కలిసిపోయింది.

"నేనో తమాషా చెప్పనా" అని మిత్రుల వంక చూశాడు సురేష్.

"చెప్పు గురూ, అంతకంటేనా" అన్నాడు నాయుడు.

"బూతు డైలాగులనగానే ఓ బూతు వ్యవహారం గుర్తొచ్చింది. చాన్నాళ్లనాటి సంగతి, అప్పుడు పెద్దాపురంలో వుండేవాణ్ని. సాహిత్యపక్షిని నేనే కావడంతో 'అభాసాగోస' కు నేను కార్యదర్శిగా వుండేవాణ్ని. అలా చూస్తారేం? ఓహో అభాసాగోస అంటే ఏవిటనా? అఖిల భారత సాహిత్య గోకుడు సంస్థ అన్నమాట. నాది సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం కదా. అది మా ఆఫీసువాళ్ల సాంస్కృతిక సంస్థ కాబట్టి జాతీయ దృక్పథంతో ఆ పేరు పెట్టారులెండి.

"సరే. ఒక సాహిత్య సంస్థ వున్న తర్వాత ఏడాదికోసారన్నా తద్దినం పెట్టక తప్పదు కదా. ఆ ఏడు కవిత్వం- స్పష్టత అనే అంశం మీద సదస్సు నిర్వహించాం. అంతకు ముందు సంవత్సరం వచ్చిన కవితా సంపుటాల నుంచి గొప్ప అస్పష్టతతో రాసిన ఓ పుస్తకానికి అవార్డు కూడా ఇచ్చాం. అవార్డు అందు కోడానికి ఆ కవిగారు కూడా వచ్చారు. మామూలుగానే అయిదుగంటలకన్న సభ ఆరు గంటలకు ప్రారంభమయింది.

"స్పష్టంగా వుంటే అది కథవుతుందిగానీ, కవితెందుకవుతుంది. కవిత్వం అంటేనే అస్పష్టంగా వుండాలనేది నిఘంటువులో లేని అర్థం" అని ఒక విమర్శక శిఖామణి గంటకు పైగా నొక్కి వక్కాణించాడు.

ఏడుగంటలు దాటేటప్పటికి కొందరి ముఖాల్లో మార్పులు మొదలయ్యాయి. ముగ్గురు నలుగురు ఓ గ్రూపు చొప్పున వెళ్లిపోవడం మొదలెట్టారు.

"స్పష్టంగా వుండే కవిత్వమే ఒక పట్టాన అందరికీ అర్థం కాదు. ఇక అస్పష్టంగా వుంటే చెప్పే పనే లేదు" మరో విమర్శక రత్నం వుపన్యసించాడు.

ఎనిమిదిన్నర అయేటప్పటికి అవార్డు గ్రహీత, అయిదారుగురు అభాసాగోస నిర్వాహకులం మిగిలాం. అవార్డు ప్రదానం కూడా ముగించి లాడ్జికి చేరాం.

అప్పటికే రెండు, మూడు రౌండ్లు ముగించి స్పష్టత, అస్పష్టత మీద స్పష్టాస్పష్టంగా వాదించుకుంటున్నారు సాహితీ మిత్రులు. అస్పష్ట అవార్డు కవిగారు అయిదు నిముషాల్లో మూడు పెగ్గులు లాగించి వాళ్లలో కలిసిపోయాడు. నేను నా లిమిట్స్‌లో వున్నాను. వాళ్ల తిండీ తిప్పలు చూడాల్సింది నేనే మరి.

భోజనాలయ్యాక నేను ఇంటికి వెళ్లడానికి స్కూటర్ స్టార్ట్ చేశాను. అస్పష్ట అవార్డు కవిగారు నా స్కూటరు వెనకాల సీటు మీద కూర్చుని, 'రైట్ రైట్' అన్నాడు.

"ఎక్కడికి" అన్నాను. "పోనీండి సార్ చెబుతాను" అన్నాడు.

కొంతదూరం వెళ్లేక, "మంచి అమ్మాయి దగ్గరకు పోనీండి" అన్నాడు.

నాక్కూడా ఆ వీక్‌నెస్ వుండేది కదా. తీసుకెళ్లాను. చెరొకళ్లనీ బుక్ చేసుకుని, పక్క పక్క రూముల్లోకి వెళ్లిపోయాం" అంటూ ఆగేడు సురేష్.

తర్వాత ఏం జరిగిందన్నట్టు అంతా సురేష్ వంక ఆసక్తిగా చూశారు. వాసు సిగ్గు పడుతూ తలదించుకుని మరింత ఆసక్తిగా చెవులు రిక్కించాడు.

కవికుమారుడు చిరాగ్గా మొహం పెట్టడం చూసి, కథరాజు చిర్నవ్వు మొహం పెట్టాడు.

"బెడ్ లైట్ కూడా ఆర్పేయ్యనా అందావిడ. వుంచు అన్నాను. రసకందాయంలో పడ్డాము. నా దృష్టి ఎందుకో ఎదురుగా వున్న గోడ పైన పడింది. వెంటిలేటర్‌లోంచి మీసాలు కనిపించి ఉలిక్కిపడ్డాను. పిల్లేమోనని చూశాను. ఆ కళ్లు పసుపు రంగులో కాకుండా ఎరుపు రంగులో అస్పష్టంగా కనిపించాయి. నేనేమో బిగుసుకు పోయినట్టున్నాను. 'ఏంటీ' అందావిడ. నా నోటంట మాట రాలేదు. వెంటిలేటర్ వెనుక కళ్లు, నా కళ్లు కలుసుకున్నాయి. వెంటనే దబ్బుమన్న శబ్దం వినిపించింది. ఆ వెంటనే వెంటిలేటర్ ఖాళీగా కన్పించింది. కాసేపటికిగానీ మామూలు మనిషిని కాలేకపోయాను. మూడ్ అంతా పోయింది." అన్నాడు సురేష్.

"ఆ ఎర్ర కళ్లు ఆ అస్పష్ట కవిగారివేనా" అని అడిగాడు వాసు.

"కాక?" అన్నాడు కథరాజు.

"అయ్యుండవు" అన్నాడు కవికుమారుడు విసుగ్గా.

"అతనికది సరదాట. అందుకే నన్ను రమ్మని బలవంతం చేశాడు. ఆ దెబ్బతో 'అభాసాగోస'కి నేను రాజీనామా చేసేశాను" అంటూ ముగించాడు సురేష్.

"మొత్తం మీద ఆ కవిగారు మిమ్మల్ని స్పష్టంగానే ఎంజాయ్ చేశాడన్నమాట" అన్నాడు కథరాజు నవ్వుతూ.


"మనకు మరో శత్రువు పెరిగాడు" అనుకున్నాడు పళ్ళు కొరుక్కుంటూ సురేష్ వంక చూస్తూ కవికుమారుడు.

అంతలో గౌతమి ఎక్స్‌ప్రెస్ బ్రిడ్జి మీదకు ప్రవేశించింది.

అంతా లేచారు. కొటేషన్‌రావు పగలబడి నవ్వుతూ అన్నాడు.

"రవి కాంచనిచో కవి గాంచున్"

(వచ్చే వారం: తారుమారు)



## తణుకులో అరుదైన సూర్యదేవాలయం!

సూర్యదేవాలయం అనగానే మనకు అస్సాంలోని కోణార్క్ గుర్తుకు వస్తుంది. కాని మన రాష్ట్రంలోనే మరో సూర్యదేవాలయం వుందంటే మనం నమ్మలేం. పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు పట్టణంలో 1953 సంవత్సరానికి చెందినదిగా భావిస్తున్న సూర్యదేవాలయం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. పట్టణంలోని సూర్యాలయం వీధిలో 43 సంవత్సరాల కిందట జ్యోస్యుల శ్రీరామమూర్తిగారు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రజలు చెబుతున్నారు. స్కాంద, పద్మ పురాణాల్లోను, అధర్వణ వేదంలోను ప్రస్తుతించిన విధంగా సూర్య భగవానుని విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించినట్లు పండితులు చెబుతారు. ఉష, పద్మిని, ఛాయ, సంజ్ఞ అనే నలుగురు భార్యల సమేతంగా సారథితో కూడి ఏకచక్ర రథారూఢుడైన ఇక్కడి సూర్య దేవుడిని పోలిన విగ్రహం భారతదేశంలో మరెక్కడా లేదని ప్రతీతి. ఈ అరుదైన ఆలయానికి జీర్ణోద్ధరణ కార్యక్రమం మొదలుపెట్టినట్లు స్థానిక ట్రస్టీ బోర్డు ఛైర్మన్ చిట్టూరి పరిపూర్ణ బ్రహ్మానంద చౌదరి 'ప్రభాత వార్త'కు తెలియజేశారు. మాఘ మాసం, ధనుర్మాసం, రథసప్తమి పర్వదినాన, ఆదివారాలలో తణుకు పట్టణంలోని ఈ సూర్య దేవాలయాన్ని అసంఖ్యాకంగా భక్తులు సందర్శిస్తుంటారు.

-బి.సూరిబాబు, 'ప్రభాత వార్త' తణుకు